

GSTIN:36FDKPS1308P1ZX

# టి-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం...

epaper,www.tmedia.net.in YouTube facebook

**టీమీడియా, ప్రత్యేక సంచిక**

- అభివృద్ధికి నిలువెత్తు రూపం తుమ్మల నాగేశ్వరరావు!
- ఖమ్మం గడ్డంపై చెరగని ముద్ర
- భక్త రామదాసు, సీతారామ కల సార్థకం
- పల్లెపల్లెకు రహదారుల విస్తరణ
- జాతీయ రహదారులకు మహర్దశ
- విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- సామాన్యులు జీవితాల్లో వెలుగులు
- గోదావరి కరకట్ట నుంచి సింగరేణి వరకు మార్కు
- నలుగురు సీఎంల వద్ద మంత్రిగా బాధ్యతలు
- రాజకీయాలకంటే అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తూ సాగిపోతున్న తుమ్మల

# అభివృద్ధి ప్రదాత



టీ మీడియా, ఖమ్మం జిల్లా బ్యూరో

**ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో తనదైన మార్క్‌తో అభివృద్ధే పరమావధిగా సాగిపోతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు ప్రస్థానం కొత్త ఒరవడిని సృష్టిస్తున్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లా గడ్డంపై ఎక్కడికెళ్లినా తుమ్మల మార్క్ అభివృద్ధి సాక్షాత్కరిస్తది. అనితర సాధ్యుడిగా ఆయన్ను గుర్తించడానికి, ఆయన సాకారం చేసిన బృహత్తర ప్రాజెక్టులే నిదర్శనం. తరతరాలుగా ఎదురుచూస్తున్న భక్త రామదాసు ఎత్తిపోతల పథకం, కరువు నేలను సస్యశ్యామలం చేసిన సీతారామ ప్రాజెక్టు కల... ఇవన్నీ ఆయన ముందుచూపు, నిబద్ధతకు నిలువెత్తు ఆనవాళ్లు. పల్లెపల్లెకు రహదారులు విస్తరించడం, జాతీయ రహదారులకు మహర్దశ తీసుకురావడం వెనుక తుమ్మల కృషి చిరస్మరణీయం. కేవలం రోడ్లు, నీటి వనరులకే పరిమితం కాకుండా, విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి, సామాన్యులు జీవితంలో వెలుగులు నింపారు. గోదావరి కరకట్ట నుంచి సింగరేణి పునాది వరకు ఆయన మార్కు స్పష్టంగా కనిపిస్తుంది. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించడం, పదవులు ఆయన్ని వెతుక్కుంటూ రావడం, ఆయన వ్యక్తిత్వానికి, అంకితభావానికి నిదర్శనం. అధికారం కంటే అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ, నిరంతరం ప్రజల కోసం ఆలోచించే ఓ నాయకుడుగా... తుమ్మల ఈ ప్రస్థానం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం. ఉమ్మడి జిల్లా చరిత్రలో తుమ్మల ఓ సువర్ణాధ్యాయం లిఖిస్తూ ముందుకు సాగిపోతున్నారు.**



**ఎన్టీఆర్ కేబినెట్ లో మంత్రిగా**

తుమ్మల నాగేశ్వర రావు రాజకీయ ప్రస్థానం 1982 సెప్టెంబర్ నెలలో దివంగత ఎన్టీఆర్ ఆశీర్వాదంతో తెలుగుదేశం పార్టీలో చేరడంతో మొదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని చర్లలో ఎన్టీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తుమ్మల.... ఆయన దీవెనలతో రాజకీయాల్లోకి అడుగుపెట్టి, తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేశారు. 1986లో చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, గోదావరి జల ప్రళయం మిగిల్చిన విషాదం సమయంలో, నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మరియు ప్రధాని రాజీవ్ గాంధీతో కలిసి వరద ప్రాంతాల్లో పర్యటించి, వరద గండం లేకుండా భద్రాచలం వద్ద కరకట్టకు రూపకల్పన చేశారు.

**గోదావరి కరకట్ట నిర్మాణం**

చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మహర్దశ పట్టించిన మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు పేరు తెచ్చుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట నిర్మాణం, కూనవరం-తాలిపేరు హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణం, ఖమ్మం బైపాస్ రోడ్, మున్నేరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం, భక్త రామదాసు ఆడిటోరియం, సర్దార్ పటేల్ స్టేడియం నిర్మాణం, పీజీ కాలేజ్ నిర్మాణం, ప్రభుత్వ జిల్లా ప్రధాన హాస్పిటల్ విస్తరణ లాంటివి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలితమే. ప్రతీ గ్రామానికి రహదారి, తాగునీరు, వ్యవసాయ మార్కెట్లు, గోడౌన్స్, విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులతో ఖమ్మం జిల్లాలో కొత్త శకానికి అంకురార్పణ చేశారు. చంద్రబాబు నాయుడు హయాంలో తుమ్మల చేసిన మరో అద్భుతమైన పని, నష్టాల్లో కూరుకుపోయిన సింగరేణిని ప్రత్యేక ప్యాకేజీతో నిలదొక్కుకునేలా పునాది వేయడం. ట్రేడ్ యూనియన్ ఎన్నికలు మరియు లాభాల్లో వాటాకు శ్రీకారం చుట్టడం ద్వారా కార్మికులకు భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయాలే నేడు తెలంగాణకు గ్రోత్ ఇంజిన్‌గా నిలిచిన సింగరేణికి బాటలు వేశాయి. వేంసూరు దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేసేలా బేతుపల్లి ఎన్టీఆర్ వరద కాలువను నిర్మించి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ పనులన్నీ తుమ్మల దూరదృష్టికి, పాలనా దక్షతకు నిదర్శనం.




**పాలేరును పచ్చగ చేసిన మంత్రి**

కేసీఆర్ ప్రభుత్వంలోనూ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన తుమ్మల నాగేశ్వరరావు గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టుకు పునాది వేయడం, పాలేరు కరువును తరమికొట్టే భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టడమంతా ఆయన హయాంలోనే జరిగింది. పాలేరును పచ్చగా చేయటానికి అనేక అవకాశాలు కల్పించారు. కేసీఆర్ ప్రభుత్వంలో తుమ్మల ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు విశేష కృషి చేశారు. అప్పారావుపేటలో నూతన పామాయిల్ ఫ్యాక్టరీ స్థాపనతో పాటు, తెలంగాణలో ఇరవై లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు క్యాబినెట్ ఆమోదం పొందేలా చర్యలు తీసుకున్నారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు జాతీయ రహదారి నిర్మాణం, పాలేరులో చెక్ డ్యాంలు, తండాలకు తారు రోడ్ల నిర్మాణంతో దశాబ్దాల కల సాకారం చేశారు. ఈ విధంగా, తుమ్మల వ్యవసాయ, మౌలిక వసతుల రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని చేశారు.

**మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం**

2023లో అధికారంలోకి వచ్చిన



ప్రజాప్రభుత్వంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులుగా తుమ్మల నాగేశ్వరరావు... రఘునాథపాలెం మండలంలోని రైతుల సాగునీటి కలను సాకారం చేస్తూ, మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్‌కు ప్రతిపాదనలు వంటివి ఆయన భవిష్యత్ లక్ష్యాలు. భద్రాచలం రామాలయం విస్తరణకు రూ.34 కోట్ల నిధులు కేటాయించడం, భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట విస్తరణ పనులు, రెండో బ్రిడ్జి ప్రారంభం వంటివి ఆధ్యాత్మిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తున్నాయి.

**విద్యా, వైద్య రంగాల అభివృద్ధి**

ఖమ్మం నగరానికి మున్నేరు నది వరద గండం లేకుండా కరకట్టల నిర్మాణం, కాల్వొడ్డు వద్ద మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణంపై తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ పనుల వేగవంతానికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఇవే కాకుండా



రఘునాథపాలెం వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజీ, స్వామి నారాయణ గురుకుల పాఠశాల ఏర్పాటు వంటివి విద్యా, వైద్య రంగాల్లో ఆయన కృషిని చూపిస్తున్నాయి. వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు, ఖమ్మంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం, ఆధునిక సౌకర్యాలతో మోడల్ వ్యవసాయ మార్కెట్ నిర్మాణం వంటివి ఖమ్మం నగరాన్ని ఆధునిక నగరంగా మారుస్తున్నాయి. ఖమ్మం నుంచి రాజమండ్రి వరకు నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం, ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం సంప్రదింపులు వంటివి తుమ్మల నాగేశ్వర రావు విస్తృతమైన దూరదృష్టికి నిదర్శనం. ఖమ్మం జిల్లాలో ప్రసూతులకు సరైన వైద్య సౌకర్యం లేదని గ్రహించి నగరంలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం నిర్మించారు.

**ఖమ్మం అభివృద్ధి కొత్త పుంతలు**

తుమ్మల నాగేశ్వరరావు తన రాజకీయ జీవితంలో సీతారామ, భక్త రామదాసు ప్రాజెక్టులను నిర్మించడం, అనేక ప్రాజెక్టులు చేపట్టి లక్షలాది మంది రైతుల తలరాతను మార్చారు. ఆయన భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆశీస్సులు, ఎన్టీఆర్ దీవెనలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నిజంగా ఒక వరం అని ప్రజలు భావిస్తున్నారు. మంత్రిగా తుమ్మల చేసిన కృషి ఖమ్మం జిల్లా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. రోడ్లు, బ్రిడ్జిలు, విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యాసంస్థలు, వైద్యశాలలు, మరియు నీటిపారుదల ప్రాజెక్టులతో ఖమ్మం గడ్డంపై చెరగని ముద్ర వేశారు. కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా, సింగరేణి వంటి సంస్థలను బలోపేతం చేసి, వేలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించారు. తుమ్మల హయాంలోనే ఖమ్మం అభివృద్ధి కొత్త పుంతలు తొక్కిందని స్థానికులు గర్వంగా చెబుతారు. 43 ఏళ్ల రాజకీయ జీవితంలో తుమ్మల నలుగురు ముఖ్యమంత్రుల కేబినెట్‌లో మంత్రిగా పనిచేసి, సుదీర్ఘకాలం పాటు మంత్రిగా రికార్డు సృష్టించారు. ఈ ప్రయాణంలో మంత్రిగా తుమ్మల చేసిన కృషి ఖమ్మం జిల్లా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఆయన చేపట్టిన ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు ముందు తరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయనటంలో అతిశయోక్తేమి లేదు. ఖమ్మం ప్రజల హృదయాల్లో ఆయన ఒక అభివృద్ధి ప్రదాతగా శాశ్వతంగా నిలిచిపోతారనేది కాదనలేని సత్యం.

